ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 2 ఆగస్టు 2024

బీఆర్‌ఎస్ శ్రేణుల నిరసన 8
8 గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

రెచ్చిపోతున్న శునకాలు



- జిల్లాలో వీధికుక్కల స్వైరవిహారం
- మనుషులతోపాటు మూగజీవాలపై దాడులు
- ఏడు నెలల్లో 3256 మంది బాధితులు
- వృద్ధురాలిని పీక్కుతిన్న కుక్కలు
- బెంబేలెత్తుతున్న చిన్నారులు
- దడ పుట్టిస్తున్న వీధికుక్కలు
- రోడ్లపై గుంపులుగుంపులుగా సంచారం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

జిల్లాలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. గుంపులుగుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. మనుషులతోపాటు మూగజీవాలపై దాడులకు దిగుతున్నాయి. క్రూరమృగాల తరహాలో దాడి చేస్తున్నాయి. జిల్లాలో ప్రతీ రోజు ఏదో ఒక చోట కుక్క కాటు సంఘటనలు చోటు చేసుకుంటు న్నాయి. తాజాగా గురువారం ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాలో గదిలో నిద్రిస్తున్న 80 సంవత్సరాల రాజ్యలక్ష్మీ అనే వృద్ధురాలిపై కుక్కలు దాడి చేసి కిరాతకంగా చంపాయి. ముఖమంతా పీక్కుతుని చంపిన సంఘటన భయానక వాతావరణాన్ని కల్పించింది. రెండు రోజుల క్రితం గంభీరావుపేటలో ఓ వృద్ధుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఏటు చూసినా బాబోయ్ కుక్కలు అనే పరిస్థితి నెలకొంది.



ఎల్లారెడ్డిపేటలో చికెన్ సెంటర్ వద్ద కోళ్లపై దాడిచేస్తున్న కుక్కలు

తల్లిదండ్రుల్లో భయాందోళనలు

జిల్లాలో ప్రధానంగా వీధి కుక్కలు చిన్నారులపై దాడి చేస్తుండడంతో తల్లి దండ్రులు భయాందోళనకు గురవుతు న్నారు. పాఠశాలకు సైకిళ్లపై, నడుచుకుంటూ వెళ్తున్నవారిపై కుక్కలు గుంపులుగా దాడి చేస్తున్న సంఘటనలు ఉన్నాయి. దీంతో ఒంటరిగా పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. మరోవైపు రాత్రి వేళల్లో వివిధ పనుల నిమిత్తం వెళ్లి వచ్చేవారు కూడా భయపడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బుల్లెట్ అకారంలో ఉండే రాబ్డీడో అనే వైరస్ వైద్య పరిభాషలో రేబీస్‌గా పిలుస్తాం. పెంపుడు జంతువుల ద్వారా వచ్చే రేబీస్ ప్రధానంగా కుక్క కాటు ద్వారా వస్తుంది. రేబీస్ ఉన్న కుక్క కరవక పోయినా, ప్రాణాంతకంగా మారే సంఘటనలు ఉన్నాయి. గోళ్లతో గీరినా, రక్కినా, పండ్లు గీచుకు పోయినా అంతకుముందు ఉన్న గాయాల మీద నాకినా మనం తినే ఆహారంలో మూతి పెట్టినా, చొంగ కార్చినా, పిల్లలు ఆటవస్తువులను ముందుగా కుక్క నాకి ఉంటే వాటిని పిల్లలు తాకి తిరిగి నోట్లో పెట్టుకోవడంతో రేబీస్ వ్యాధి రావడానికి మార్గాలు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రేబీస్ వ్యాధి ఎక్కువ శాతం పిచ్చికుక్క కరవడం ద్వారా సోకుతుంది. కుక్క కరవగానే నరాల ద్వారా వేగంగా మెదడుకు చేరి వ్యాధిని కలిగిస్తుంది. కుక్క కరిచిన తొమ్మిది రోజుల నుంచి కొన్ని నెలల్లోపు ఎప్పుడైనా లక్షణాలు బయటపడవచ్చు. సాధారణంగా నాలుగు నుంచి 8 వారాల్లో బయట పడుతుంది. మెదడు దగ్గర కుక్క కరిస్తే త్వరగానూ, ఇతర ప్రాంతాల్లో కరిస్తే కొంత ఆలస్యంగానూ లక్షణాలు బయటపడుతాయి. గీచుకుపోయిన గాయం ద్వారా అయితే కొంత సమయం పడుతుంది. లోతుగా పండ్లు దిగి కండను పీకేస్తే త్వరగా లక్షణాలు బయటపడుతాయి. కరిచిన చోట నొప్పి పొడిచినట్లు బాధ ఉంటుంది. తల నొప్పి, గొంతువాపు, ఒళ్లు నొప్పులు, నీరసం ఆకలి మందగించడం, వాంతులు, పొడిదగ్గు, నాడీ మండలానికి సంబంధించిన లక్షణాలు కనిపిస్తాయి. రోగ నిరోధక శక్తి ఉన్న సమయంలోనే పిచ్చికుక్క కరిస్తే వారం రోజులకు ఒకటి చొప్పున ఇంజక్షన్లు తీసుకోవాలి. రేబీస్ వ్యాధి రాకుండా ముందే ఇంజక్షన్లు తీసుకోవడం ద్వారా నియంత్రించవచ్చు. రేబీస్ వ్యాధి వచ్చిన తరువాత చికిత్స లేదనే చెప్పుకోవచ్చు.

జిల్లాలో 3,256 మంది బాధితులు

జిల్లాలో గడిచిన ఏడు నెలల్లో 3256 మంది కుక్క కాటు బాధితులు ఉన్నారు. ప్రతీ రోజు సరాసరి 15 మంది కుక్కల దాడికి గురవుతున్నారు. సిరిసిల్ల జిల్లా ఆసుపత్రిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 834 మంది బాధితులు చికిత్సకు వచ్చారు. వేములవాడ ఏరియా అసుపత్రికి 635 మంది, కోనరావుపేట మండలంలో 192, గంభీరావుపేట 331, తంగళ్లపల్లి 109, చందుర్తి, రుద్రంగిలో 33, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లిలో 308, ముస్తాబాద్ 206, ఇల్లంతకుంటలో 176 మంది కుక్కకాటుకు గురయ్యారు.



మృతి చెందిన వృద్ధురాలు



గాయపడిన వృద్ధుడు

మాంసం వ్యర్థాలకు అలవాటుపడి

జిల్లాలో చికెన్, మటన్ దుకాణాల వద్ద మాంసం వ్యర్థాలకు అలవాటు పడిన కుక్కలు క్రూరంగా దాడి చేస్తున్నాయని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా రోడ్లపై కూడా వ్యర్థాలు ఎక్కువగా పడేయడంతో కుక్కలు వాటికి అలవాటు పడి జనవాసాల మధ్య తిరుగుతూ దాడులు చేస్తున్నట్లు తెలుస్తోంది. రోడ్లపై సంచులతో వెళ్తున్న వారిపై దాడి చేసి వాటిని లాగుతున్నాయి. గ్రామాల్లో మేకలు, గొర్రెల మందలపై దాడులు చేస్తూ పీక్కుతిం టున్నాయి. గ్రామాల్లో మందలపై దాడి చేయడంతో వందల సంఖ్యలో చనిపోయిన సంఘటనలు ఉన్నాయి.

కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం వీధి కుక్కలకు రేబీస్ టీకాలు, సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయడానికి సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ భారీగానే ఖర్చు పెడుతోంది. గతంలో వెయ్యి కుక్కలకు వ్యాక్సినేషన్, శస్త్ర చికిత్సకు రూ.16 లక్షలు ఖర్చు చేయగా తాజాగా ఒక్కో కుక్కకు రూ.1650 చొప్పున రూ.16.50 లక్షలు జనరల్ నిధుల నుంచి మంజూరీ ఇచ్చారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?



అధ్వానంగా మారిన నాగంపేట- పొన్నాలపల్లె రోడ్డు

గంభీరావుపేట, ఆగస్టు 1: గంభీరావుపేట మండలం పొన్నాలపల్లె-నాగంపేట మధ్య మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడిన ప్రతీసారి వాహనాలు వెళ్లలేని పరిస్థితి. అధికారులు పట్టించుకోవాలని, తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తల్లిపాలు శిశువుకు శ్రీరామరక్ష

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

సిరిసిల్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు శిశువుకు శ్రీరామరక్షని, తల్లి పాల విశిష్టతను వారోత్సవాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే తల్లి పాల వారోత్సవాలను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రారంభించారు. తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆసుపత్రిలో బాలింతలకు కలెక్టర్‌తోపాటు ప్రజాప్రతినిధులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 7 వరకు జరిగే తల్లిపాల వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించాలన్నారు. పుట్టిన ప్రతీబిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలను మాత్రమే అహారంగా అందించాలని, పుట్టిన గంటలోపు ముర్రుపాలు శిశువుకు పట్టించాలని అన్నారు. రోగ నిరోధక శక్తి పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వసంతరావు, మున్సిపల్ కమిషనర్ లావణ్య, ఆసుపత్రుల సమన్వయ కర్త డాక్టర్ పెంచలయ్య, సూపరింటెండెంట్ డాక్టర్ నాగార్జున, డాక్టర్ సంతోష్, డాక్టర్ కాశీనాథ్, డాక్టర్ సాయి, సీడీపీవోలు ఎల్లయ్య, ఆలేఖ్య పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఆస్పత్రిని పరిశీలించిన కలెక్టర్

జిల్లా ఆస్పత్రిని కలెక్టర్ సందీప్‌కమార్ ఝా పరిశీలించారు. ఆస్పత్రిలో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

స్వీయ రక్షణ విధానాలు నేర్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్



కరాటే శిక్షణలో విద్యార్థినులు

తంగళ్లపల్లి, ఆగస్టు 1: మహిళలు, విద్యార్థినులు స్వీయ రక్షణ విధానాలు నేర్చుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆపరేషన్ జ్వాల -2కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని మహిళలు, విద్యార్థినుల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గతేడాది ఆపరేషన్ జ్వాల (సెల్ఫ్ డిఫెన్స్) చేపట్టామన్నారు. పాఠశాలల్లో సుమారు 2వేల మందికిపైగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తిరిగి ఆపరేషన్ జ్వాల-2 పేరుతో సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెల్ఫ్ డిఫెన్స్ విద్యార్థినులకు ఆపద సమయాల్లో ఉపయోగపడుతుందన్నారు. కేవలం ఆకతాయిల బారి నుంచే కాకుండా చైన్ స్నాచింగ్, మహిళలపై లైంగిక దాడులు జరిగే క్రమంలో సమర్థవంతంగా తిప్పికొట్టవచ్చన్నారు. ఆపద సమయాల్లో షీ టీమ్‌కుగానీ డయల్ 100కుగానీ సమాచారం అందించాలన్నారు. ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ మొగిలి, ఎస్సై సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్

వేములవాడ టౌన్: ఆత్మరక్షణ కోసం అమ్మాయిలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి సూచించారు. వేములవాడ పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో గురువారం ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదేశాల మేరకు జ్వాల-2 కార్యక్రమంలో భాగంగా స్వీయ రక్షణపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ రన్నింగ్, వ్యాయామం, కరాటే, మార్షల్ ఆర్ట్స్ వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. అమ్మాయిలు తమను తాము రక్షించుకునేలా తయారవ్వాలన్నారు. టౌన్ సీఐ వీరప్రసాద్, కరాటే మాస్టర్ మన్నాన్, కేజీబీవీ స్పెషల్ అధికారిని స్వప్న తదితరులు ఉన్నారు.

ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 1: ప్రత్యేక అధికారులు కేటాయించిన గ్రామాల్లో పర్యటించాలని, సమస్యలతోపాటు పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలని, తడిపొడి చెత్త వేరు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలని, కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు. వర్షాల నేపథ్యంలో నీటిని క్లోరినేషన్ చేయించాలని, నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. జడ్పీ సీఈవో ఉమారాణి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, డీఆర్డీవో శేషాద్రి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, డీపీవో వీర బుచ్చయ్య జిల్లా వైద్యాధికారి వసంతరావు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, ఎస్సీ రాధాభాయి, ఎస్సీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా వెటర్నరీ అధికారి, డీఏవో భాస్కర్, మిషన్ భగీరథ ఈఈలు విజయ్ కుమార్, జానకి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 1: తనకు న్యాయం చేయాలని తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన బత్తుల ఎల్లయ్య గురువారం ఫ్లెక్సీతో కలెక్టరేట్ ఎదుట బైఠాయించాడు. బాధితుడి వివరాల ప్రకారం.. ఎల్లయ్యకు తన వారంటూ ఎవరూ లేరు. ఏడాది క్రితం తనతో జీవితం పంచుకుంటానని వచ్చిన భార్య రెండెకరాల భూమి అమ్ముకొని వెళ్లిపోయింది. ఈ పరిస్థితుల్లో ఒంటరిగా ఉంటున్న ఎల్లయ్య గోపాల్‌రావుపల్లెలోని తన మేనల్లుడు ప్రశాంత్‌ను చేర దీశాడు. ఆస్తి ఎల్లయ్య పేరున ఉంటే వెళ్లిపోయిన భార్య వచ్చి కాజేస్తుందని మాయ మాటలు చెప్పి ప్రశాంత్ తన పేరు మీద రాయించుకున్నాడు. ఇప్పుడు ఆ ఆస్తిని అమ్ముకోవడానికి బేరం పెట్టాడు. దీంతో ఎల్లయ్య తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

కోతకు గురైన రోడ్డు.. గ్రామస్థుల ఆందోళన

చందుర్తి, ఆగస్టు 1: వరద నీటితో రోడ్డు కోతకు గురైనా ఎవరూ పట్టించుకోవడంలేదని, ఇళ్ల నుంచి బయటకి రావాలంటే ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని కట్ట లింగంపేట గ్రామస్థులు గురువారం ఆందోళన చేపట్టారు. ఐదేళ్ల క్రితం గురునాథం చెరువు నుంచి వచ్చే వరద నీటితో రోడ్డు కోతకు గురైందన్నారు. అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. కోతకు గురైనచోట వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు.

న్యాయవాదుల సంక్షేమమే లక్ష్యం

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 1: న్యాయవాదుల సంక్షేమమే లక్ష్యమని రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ సంస్థ సలహా మండలి సభ్యుడు పి.వి. రాజ్‌కుమార్ అన్నారు. గురువారం జిలాలోని సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ హాలులో వేర్వేరుగా న్యాయవాదులకు హెల్త్‌కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి రూ.100కోట్లు కేటాయించిందన్నారు. న్యాయవాదుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఒక్కో న్యాయవాది కుటుంబానికి రూ.2లక్షల ఆరోగ్య బీమా పొందవచ్చన్నారు. సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు డోర్నాల లక్ష్మారెడ్డి, గుడిసె సదానందం, కార్యదర్శులు వెంకటి, రజనీకాంత్, ఏజీపీ పొత్తూరి అనిల్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



హెల్త్ కార్డులు అందజేస్తున్న రాజ్‌కుమార్

దంచి కొట్టిన వాన



జిల్లా కేంద్రంలో రోడ్లపై నిలిచిన వర్షపునీరు

సిరిసిల్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పొద్దంతా వేడితో ఉక్కపోసిన ప్రజలకు ఊరటను ఇస్తూ గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలో వర్షం దంచికొట్టింది. దాదాపు 30 నిముషాల పాటు భారీగా వర్షం కురవడంతో రోడ్డు జలమయంగా మారాయి. సిరిసిల్ల చేనేత చౌక్, సర్దార్‌నగర్, వెంకంపేట, సంజీవయ్యనగర్, తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీల్లు నిలిచాయి. కార్మిక వాడల్లో రోడ్లపై నీరు పారడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వేములవాడ టౌన్: వేములవాడలో గురువారం. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన వర్షం రాత్రి 7.30 గంటల వరకు కురుసింది. దీంతో వేములవాడ పట్టణంలోని జాతరగ్రౌండ్‌లోని పలు షాపుల్లోకి నీరు చేరింది. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు కొంత ఇబ్బందులు పడ్డారు.



వేములవాడ రాజన్న ఆలయం ఎదుట కురుస్తున్న వర్షం

5 నుంచి స్వచ్ఛదనం.. పచ్చదనం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 1: జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో ఆగస్టు 5 నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి మాట్లాడారు. ఆగస్టు 5న కార్యక్రమాన్ని ప్రారంభించాలని, 6న తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, 7న మురికి కాలువలు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రత, గుంతలను పూడ్చడం, 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన, వీధికుక్కల దాడుల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. 9న డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛదనం, పచ్చదనం నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ఈ కార్యక్రమాలను మానిటరింగ్ చేయాలని సూచించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా వైద్యాధికారి వసంతరావు, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, డీపీవో వీరబుచ్చయ్య, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గోవులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

వేములవాడ టౌన్, ఆగస్టు 1 : వానాకాలం నేప థ్యంలో గోశాలలోని గోవులపై ప్రత్యేక శ్రద్ధ వహిం చాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ గోశాలను గురువారం తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లా డుతూ గోశాలను పరిశుభ్రంగా ఉంచాలని, నిత్యం సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి

ప్రభుత్వ నిర్దేశానుసారం పిల్లలకు పోషకాహారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. తిప్పాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, సమీపంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఇంగ్లీష్, మాథ్స్ సబ్జెక్టులలో ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

తంగళ్లపల్లి, ఆగస్టు 1: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తంగళ్లపల్లి మండల ప్రత్యేక అధికారి ఆర్డీవో రమేష్ సూచించారు. గురువారం తంగళ్లపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.కుక్కల బెడద లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గిరిజనులకు హక్కులు కల్పించాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 1: ప్రభుత్వం తీసుకొచ్చిన 2006 ఆర్‌వోఎఫ్ఆర్ చట్టానికి లోబడి గిరిజనులకు హక్కులు కల్పించాలని బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. అటవీ శాఖ అధికారులు సాగును అడ్డుకోవడంతో మనస్తాపం చెంది గత నెల 31న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీర్నపల్లి మండలం బాబాయిచెరువు తండాకు చెందిన అజ్మీరా రాజును ఆ సంఘం నాయకులతో కలిసి గురువారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ పట్టాదారు పుస్తకాలు ఉన్న గిరిజన రైతులు భూములను సాగు చేసుకుంటే అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. ప్రభుత్వం సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలను జారీ చేసి అడ్డుకోవడాన్ని నిలిపి వేయాలని కోరారు. అజ్మీరా రాజుకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు ప్రభుత్వపరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు తిరుపతినాయక్, ప్రకాశ్‌నాయక్, సీత్యానాయక్, దేవిలాల్‌నాయక్, రాజేశ్‌నాయక్, భరత్‌నాయక్, బాలునాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

వేములవాడ రూరల్, ఆగస్టు1 : ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మండల కాంగ్రెస్ నాయకులు గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో సుదీర్ఘంగా చర్చించారు. ఇదిలా ఉండగా నామినేటెడ్ పోస్టుకోసం ఎమ్మెల్యేను కలిసేందుకు నాయకులు వెళ్లారని గుసగుసలు వినిపిస్తున్నాయి. నాయకులు బొడ్డు రాములు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, బత్తిని ఎల్లాగౌడ్, నల్ల తిరుపతి రెడ్డి, చింతలకోటి రాజు, నాగుల విష్ణు ప్రసాద్, దాన వేణు, కొంపల్లి శ్రీకాంత్, తిరుపతి, ప్రశాంత్ కుమార్, సురేష్ ఉన్నారు.

కొండగట్టు ఈవోగా రామకృష్ణ


నూతన ఈవోకు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

మల్యాల, ఆగస్టు 1: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం నూతన ఈవోగా నియమితులైన ఎం.రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. దేవాదాయ శాఖలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఈవోగా నియమితులైన అనంతరం కొండపైకి వచ్చిన ఆయన మొదట స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఈవోకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో ప్రస్తుతం ఇన్‌చార్జి ఈవోగా కొనసాగుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆకునూరి చంద్రశేఖర్ నుంచి పూర్తి స్థాయి ఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు నూతన ఈవోను కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, సీనియర్ అసిస్టెంట్‌లు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, రాజేశ్వర్‌రావు, లతాదేవి, లక్ష్మారెడ్డి, ధర్మేంధర్, శ్రీనివాస్, లక్ష్మిరాజం, సంపత్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

వాహన త్రైమాసిక పన్నుల బకాయిలు చెల్లించాలి : డీటీసీ

తిమ్మాపూర్, ఆగస్టు1: వాహనాల యాజమానులు త్రైమాసిక పన్ను బకాయిలను సకాలంలో చెల్లించాలని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ పి.పురుషోత్తం కోరారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని బైపాస్‌లోని లారీ ఓనర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ప్రచార వాహనాన్ని డిటిసి పురుషోత్తం జెండా ఊపి ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైమసిక పన్ను బకాయిలు నిర్ణీత సమయంలో చెలించని వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే 200శాతం అపరాధ రుసుముతో పాటు వాహనం జప్తు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వాహనదారులు త్రైమాసిక పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రచారం చేసేందుకు ప్రచార వాహనం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్రచార రథం జిల్లాలోని అన్ని మండలాలలో తిరుగుతూ సకాలంలో పన్నులు చెల్లించాలని ప్రచారం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా వాహనదారులు బకాయిగా ఉన్న త్రైమసిక పన్నుల బకాయిలు చెల్లించాలని డిటిసి పురుషోత్తం కోరారు. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్ చక్రవర్తి, రవి కుమార్, అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ అభిలాష్, కానిస్టేబుల్స్, హోంగార్డులు, లారీ అసోసియేషన్ అధ్యక్షులు పెద్ది రమేష్, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ నేత కార్మికుడి మృతి

గంగాధర, ఆగస్టు 1: చికిత్స పొందుతూ నేత కార్మికుడు మృతి చెందినట్లు ఏఎస్సై రమణారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రామడుగు మండలం షానగర్‌కు చెందిన మిట్టపల్లి రమేష్(45) ఇంటి వద్ద సాంచాలు నడుపుతూ జీవిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది గంగాధర మండలం కురిక్యాల శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న ర మేష్‌ను స్థానికులు గమనించి 108 సమాచారం అందించగా కరీంనగర్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యుల సూచనల మేరకు నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మిట్టపల్లి నరేష్ "ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్‌ఐ తెలిపారు.

రూ.7,200 పలికిన పత్తి ధర

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,200 పలికింది. గురువారం ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,200, కనిష్ఠ ధర రూ.7,100 చెల్లించి కొనుగోళ్ల చేపట్టారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి..
ముండక్కై, చురాల్‌మలలో పర్యటన
» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి
» 289కి పెరిగిన మరణాలు


పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!
» జూలై 13న గాజాలో అంతం చేశాం
» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం
» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్లు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.





కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)


వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు




కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు
» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.





కొనసాగుతున్న శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరు రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం ఎగువ ప్రాంతం నుంచి రాత్రి 9 గంటల వరకు 8,234 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 5,813 క్యూసెక్కులు వస్తుండగా, కడెం ప్రాజెక్టు నుంచి 2421క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.084 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరుకు నంది పంప్‌హౌస్ నుంచి 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 5.630 టీఎంసీల నీటిని మిడ్ మానేరుకు తరలించారు.


గాయత్రి పంప్ హౌస్ వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

గాయత్రి పంప్‌హౌస్‌ను సందర్శించిన కలెక్టర్

రామడుగు : మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి ఆరవ రోజు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా 12,600 కూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఇప్పటి వరకు 5.5 టీఎంసీల నీరు మిడ్ మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. పంప్‌హౌస్‌ను గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీటిని పరిశీలించిన అనంతరం అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంపుల సామర్థ్యం, విద్యుత్తు వినియోగం, నీటి విడుదల వివరాలను అడిగారు. డీఈఈ రాంప్రదీప్ కలెక్టర్‌కు పలు వివరాలను వెల్లడించారు. మొత్తం 4, 5 పంపుల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నామని తెలిపారు. ఒక్కో పంపు ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఒక రోజుకి ఎత్తిపోస్తున్నామన్నారు. ఒక్కొక్క పంపుకు 139 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఇప్పటి వరకు ఎత్తిపోతలు విజయవంతంగా సాగుతున్నాయన్నారు. గాయత్రి పంప్‌హౌస్‌ప్రాంతాన్ని విజ్ఞాన విహారకేంద్రంగా ఏర్పాటు చేస్తే బాగుంటుందని కలెక్టర్ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా విహార కేంద్రంగా ఏర్పాటు చేయటం ద్వారా సెక్యూరిటీ సమస్యలు వచ్చే అవకాశం ఉందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ప్రాజెక్ట్ గురించి విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. అనంతరం పంప్‌హౌస్ ప్రాంతంలో కలెక్టర్ మొక్కలను నాటారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12వేల 600 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 310.22ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 11.68 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఎస్సారెస్పీలోకి 50 వేల క్యూసెక్కుల నీరు

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీటి రాక భారీగా పెరిగింది. మహారాష్ట్రలోని అంబూరా, బాలేగావ్ ప్రాజెక్టులు నిండడం వల్ల అక్కడి నుంచి వదులుతున్న నీరు ఎస్సారెస్పీలోకి వస్తోంది. బాబ్లీ ప్రాజెక్టు పైన గల బాలేగావ్ ప్రాజెక్టుకు చెందిన నాలుగు వరద గేట్లను ఎత్తి దిగువకు నీరు వదు లుతున్నారు. గత నెల 31వ తేదీ రాత్రి 9 గంటలకు 11 వేల క్యూసెక్కులను బాలేగావ్ ప్రాజెక్టు నుంచి దిగువకు వదలడం ప్రారంభించగా ఈ నెల 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి సుమారు 50 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బాలేగావ్ నుంచి బాబ్లీ ప్రాజె క్టులోకి వస్తున్న నీరు బాబ్లీ గేట్లు తెరిచి ఉండడం వల్ల నేరుగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వస్తున్నాయి. గురువారం రాత్రి 8 గంటల వరకు సుమారు 50 వేల క్యూసెక్కుల కుపైగా వరద నీరు ఎస్సారెస్పీలోకి వచ్చి చేరుతోంది.

ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 37.113 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.499 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.579 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

13 మంది సీఐల బదిలీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 1: కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని పలువురు సీఐల బదిలీలు జరిగాయి. ఈ మేరకు గురువారం మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ సీఎస్‌బీ-3 సీఐగా పనిచేస్తున్న జి తిరుమల్ హుజూరాబాద్ సీఐగా బదిలీ అయ్యారు. హుజూరాబాద్ సీఐగా పనిచేస్తున్న బి రమేష్ కరీంనగర్ సీసీఎస్ సీఐగా బదిలీ చేశారు. అలాగే ఆసిఫాబాద్ జిల్లా వాంఖిడి సీఐ బి శ్రీనివాస్ కరీంనగర్ సీఎస్‌బీ-3 సీఐగా, రాజన్న సిరిసిల్ల జిల్లా సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న కె ప్రవీణ్‌కుమార్‌ను పెద్దపల్లి సీఐగా, పెద్దపల్లి సీఐగా పనిచేస్తున్న ఆర్ కృష్ణ ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. మల్టీజోన్-1లో మొత్తం 13 మంది సీఐలకు బదిలీలు జరిగాయి.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

గంగాధర, ఆగస్టు 1: మండలంలోని వెంకటయ్యపల్లిలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి ఒకరు మృతి చెందాడు. గ్రామానికి చెందిన గుండు అంజయ్య(40) గ్రామంలో గురువారం డిష్ కేబుల్‌ను అమర్చుతున్నాడు. దారి పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసి వైరు అమర్చుతుండగా ప్రమాదవశాత్తు విద్యుతాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు.

మైక్రోఫైనాన్స్‌పై చర్యలు తీసుకోవాలి



నిరాహారదీక్ష చేస్తున్న నేతన్నలు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 1 : వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో కార్మికులు పస్తులు ఉంటే తీసుకున్న అప్పులను చెల్లించాలని మైక్రోఫైనాన్స్, బంధన్ బ్యాంకులు వేధింపులకు గురిచేయడం సరికాదని, కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, దోమల రమేష్, చింతకింది సుదన్, ఆడెపు రఘు, బల్ల రామచంద్రం, ఐరన్ ప్రవీణ్, వేముల మహేష్, నందాల కిషన్, అడిగోప్పుల సతీష్, శ్యాం కూర్చున్నారు. పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలివెంకటరమణ, మోరరవి, ఆడెపు రవీందర్, గద్దర్ కూతరు వెన్నెల, మానేరు కవులు వెంగళ లక్ష్మణ్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ఏఐటీయూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పంతం రవి, అసాములసమన్వయ కమిటి అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమలు సంక్షోభంలో కూరుకపోయి 7 నెలలు నుంచి ఆ పరిశ్రమలపై ఆధారపడిన వాళ్లందరికి ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ప్రభుత్వం సమస్యలను పరిష్కారించకుండా కార్మికులకు ఉపాధిని కల్పించకుండా రాజకీయ కక్ష సాధింపుకు నేతన్నలను బలిచేస్తున్నారని అన్నారు. వస్త్ర పరిశ్రమలు బంద్ పడడంతో ఎలాంటి ఉపాధి లేక కార్మికులు ఇబ్బందులు పడుతుంటే అప్పులు కట్టాలంటూ కార్మికుల కుటుంబాలను మైక్రో ఫైనాన్స్ బంధన్‌బ్యాంక్‌ల చెందిన వారి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



సిరిసిల్లలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కోవ లక్ష్మీని అవమానపరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వ్యాఖ్యలు చేశారని, తెలంగాణ ఆడపడుచులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేసే క్రమంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దిష్టిబొమ్మను తొలగిస్తుండగానే ఫ్లకార్డులను వేసి దహనం చేశారు. మరో వైపు దిష్టిబొమ్మను పోలీసులు లాక్కెళ్లకుండా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడంతో పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. చివరికి దిష్టిబొమ్మను దహనం చేశారు. కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆడపడుచులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణలో ఆడపడుచులను కించపర్చే సంస్కృతి లేదని, అసెంబ్లీలో మాట్లాడిన తీరు అభ్యంతకరంగా ఉందని అన్నారు. అంతేకాకుండా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ పారిశ్రామికులను కించపర్చే విధంగా మాట్లాడారన్నారు. నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మాజీ ఎంపీపీలు సరస్వతి, మానస, పిల్లి రేణుక, బండి దేవదాస్, గజభీంకార్ రాజన్న, జూపల్లి శ్రీలత, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు బత్తుల వనజ, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, మల్లారెడ్డి, రాజు, సికిందర్, హరీష్, అంతయ్య, వెంకట రమణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యువజన, మహిళా నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ బీఆర్ఎస్ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ యువజన సంఘం నాయకుడు మైలారం రాము బాటిల్‌లో డిజిల్ తీసుకొచ్చి ఒంటిపై పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా గమనించిన బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్, మారం కుమార్, సిరిగిరి చందు, నాయకులు బండ నర్సయ్య యాదవ్, రామ్మోహన్‌రావు,చంద్రయ్య గౌడ్, ఈర్లపల్లి రాజు, సందీప్, రాకేష్ తదితరులు ఉన్నారు.



వేములవాడలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మకర తోరణానికి వెండి బహూకరణ

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 1: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాలలో నిర్మించిన హనుమాన్ దేవాలయంలో మకరతోరణం ఏర్పాటుకు గ్రామానికి చెందిన కృష్ణమనేని పాపారావు, ప్రియాంక దంపతులు రూ.3.10 లక్షల విలువైన 3 కిలోల 600గ్రాముల వెండిని ఆలయ కమిటీకి గురువారం అందించారు. విజయ డెయిరీ జిల్లా అధ్యక్షుడు దడిగెల శ్రావణ్‌రావు, మాజీ ఉపసర్పంచ్ మెడుదుల రాములు, దడిగెల రామారావు, దడిగెల రఘునందన్‌రావు, తుమ్మల నర్సయ్య వెంగళం శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఆలయ కమిటీకి వెండి అందిస్తున్న పాపారావు

గంజాయి తాగుతున్న యువకుల అరెస్టు

చందుర్తి/కోనరావుపేట, ఆగస్టు 1: గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. చందుర్తి సర్కిల్ కార్యాలయంలో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు.చందుర్తి మండలం మూడపల్లి పరిసర ప్రాంతాల్లో గంజాయి తాగుతున్నారన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెదిన చిట్కూరి ఈశ్వర్, చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన చీకుంట గణేష్ గంజాయి తాగుతున్నారు. వారిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థినులను ఇంటికి చేర్చిన పోలీసులు

వీర్నపల్లి: ఆగస్టు 1: మారుమూల అటవీ ప్రాంతంలో చదువుకుంటున్న విద్యార్థినులు వర్షంలో తడుస్తూ రాత్రి బస్సు కోసం నిరీక్షిస్తుండగా స్థానిక పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో ఇంటికి తరలించి మానవత్వం చాటుకున్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదివే ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతీరోజు రాత్రి వరకు బస్సులో ఇళ్లకు చేరుకుంటున్నారు. గురువారం రాత్రి వర్షానికి బస్సు రాకపోవడంతో విద్యార్థినులు వర్షంలో తడుస్తూ భయంతో వణుకుతున్నారు. గమనించిన పీఈటీ ప్రతాప్ స్థానిక ఎస్సై ఎల్లాగౌడ్‌కు సమాచారం అందించారు. వెంటనే పోలీసు వాహనంలో విద్యార్థులను ఎల్లారెడ్డిపేట వరకు తీసుకెళ్లి మరో బస్సులో ఎక్కించి ఇళ్లకు పంపించారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీ వైస్ చైర్మన్

ఇల్లంతకుంట, ఆగస్టు 1: అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయాలని మాజీ జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మధ్యమానేరులో నీటి మట్టం పెరిగినందున ఎడారిగా మారిన అన్నపూర్ణ రిజర్వాయర్‌ను నీటితో నింపాలని కోరారు. యాసంగిలో రిజర్వాయర్‌లో నీరు లేకపోవడంతో వేలాది ఎకరాలలో పంటలు ఎండిపోయాయన్నారు. ఎమ్మెల్యే సత్యనారాయణ స్పందించి అధికారులతో మాట్లాడి సమస్య తీర్చాలని కోరారు. నాయకులు కేవీఎన్‌రెడ్డి, బుర్ర సూర్యగౌడ్, రడం ప్రవీణ్, రాములు యాదవ్, రఘు, గొజగాని కిషన్, దయ్యాల మహేష్ పాల్గొన్నారు.

సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 1: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని యాదవ సంఘ భవన నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. నిధుల మంజూరు పత్రాన్ని గురువారం సంఘం సభ్యులకు ఆయన అందజేశారు. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక దృష్టి సారించి రాజ్యసభ సభ్యుడు కేఆర్‌రెడ్డి సురేశ్‌రెడ్డి ప్రత్యేక నిధులను మంజూరు చేయించారని తెలిపారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు సందీప్, పర్శరాములు, బాలగౌడ్, రమేశ్, శివరామకృష్ణ ఉన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మహిళలు ఇప్పుడు గుర్తొచ్చారా ?

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 1: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గతంలో మహిళల పట్ల వ్యవహరించిన తీరును మర్చిపోయి ప్రస్తుతం ఆందోళనలకు దిగడం సిగ్గు చేటని, మహిళలు ఇప్పుడు గుర్తుకు వచ్చారా? అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయడం తగదన్నారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహించిన నియోజక వర్గంలో ఆ పార్టీ నాయకులు విద్యార్థినులు, మహిళలపై చేసిన అఘాయిత్యాలు, దౌర్జన్యాలు ప్రజలు మరిచిపోలేదన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, బాబు, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, రవి తదితరులు ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

కోనరావుపేట, ఆగస్టు 1: బిడ్డకు తల్లి పాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఎదుగుతారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కనక మహాలక్ష్మి అన్నారు. కోనరావుపేట మండలంలోని సుద్దాల, ధర్మారం తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించా ఐసీడీఎస్ సూపర్ వైజర్ మమత తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తంగళ్లపల్లి, ఆగస్టు 1:తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లిలో కాంగ్రెస్ నాయకుడు మీరాల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రెండో విడత రుణమాఫీపై హర్షం వ్యక్తం చేశారు.

5న వ్యాపార సముదాయాలకు వేలం

ఇల్లంతకుంట, ఆగస్టు 1: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ అధీనంలోని వ్యాపార సముదాయాలకు ఈ నెల 5న వేలం నిర్వహించనున్నట్లు ప్రత్యేకాధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ సమీపంలోని షట్టర్లు, వాటర్ ప్లాంట్, కూరగాయల సంతకు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో వేలం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బీజేపీ మండల కన్వీనర్‌గా శ్రీనివాస్

ఇల్లంతకుంట, ఆగస్టు 1: బీజేపీ మండల కన్వీనర్‌గా దేశెట్టి శ్రీనివాస్‌ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని వెల్జిపూర్‌కు చెందిన శ్రీనివాస్ గతంలో పార్టీలో పలు పదవులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రధానకార్యదర్శి రేగుల మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్ వెల్ఫేర్ అసోసియేషన్

వేములవాడ టౌన్, ఆగస్టు 1: వేములవాడ పట్టణంలోని శ్రీమహాలక్ష్మి ముదిరాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం ఎనుకున్నట్లు సంఘ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా రేగుల రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గొట్టం శివకుమార్, ఉపాధ్యక్షుడిగా రమేష్‌బాబు, గౌరవ అధ్యక్షుడిగా అంజయ్య కోశాధికారిగా కొలకాని దినేష్, ముఖ్య సహాదారులుగా దేవయ్య కొలకాని రాజు, కనుకయ్య మధు, కమిటీ సభ్యులను ఎనుకున్నట్లు పేర్కొన్నారు.

'ఆదర్శ' మాల సంక్షేమ సంఘం

వేములవాడ టౌన్, ఆగస్టు 1:వేములవాడ మండలం సంకెపల్లిలోని ఆదర్శ మాల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పండుగ నిరంజన్, ఉపాధ్యాక్షుడిగా నర్సింహాస్వామి, కోశాధికారిగా ఎల్లయ్య ఆర్గనైజింగ్ సెక్రెటరీగా మహేష్ ఎన్నికయ్యారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నిరసన వ్యక్తం చేస్తున్న సిరిసిల్ల న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 1: కోర్టు ఆర్డర్‌లను, న్యాయవాదులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడమే కాకుండా సీనియర్ న్యాయవాది సురభి సత్యనారాయణపై తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి, ఉపాధ్యక్షుడు దుర్గారెడ్డి, ట్రెజరర్ విష్ణు, జాయింట్ సెక్రెటరీ నాగరాజు, కల్చరల్ సెక్రెటరీ గుడ్ల కిషన్, గ్రంధాలయం కార్యదర్శి శశాంకం, సీనియర్ న్యాయవాదులు ఉమాశంకర్, వసంతం, ధర్మేందర్, రవిందర్‌రావు, కోడం సురేశ్, గోవిందు భాస్కర్, కోడి లక్ష్మణ్, ఆడెపు వేణు, మహిళా ప్రతినిధి పుష్పలత, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: న్యాయవాదులపై అక్రమ కేసులను నమోదు చేయడానికి నిరసిస్తూ వేములవాడ కోర్టు ముందు న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపిన అనంతరం న్యావాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సదానందం మాట్లాడుతూ సిరిసిల్ల సీనియర్ న్యావాది సురభి సత్యనారాయణరావుపై తంగళపల్లి పోలీస్ స్టేషన్‌లో అక్రమ కేసు నమోదు నమోదు చేయడానికి ఖండిస్తున్నామని అన్నారు. న్యాయవాదులపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడానికి తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు

ఇల్లంతకుంట, ఆగస్టు 1: ఎస్సీవర్గీకరణను సుప్రీంకోర్టు సమర్థించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో గురువారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణ సమంజసమేనని సుప్రీంకోర్టు పేర్కొనడం సంతోషకరమన్నారు. ప్రభుత్వాల సహకారం మరువలేనిదన్నారు. ఎస్సీవర్గీకరణతో ఆర్థికంగా వెనుకబడినవారికి న్యాయం జరుగుతుందన్నారు. అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు తడకపెల్లి భూమయ్య, నాయకులు గుండ్రెడ్డి రాజు, పసుల వెంకటి పాల్గొన్నారు.



ఇల్లంతకుంటలో సంబరాలు నిర్వహిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మాదిగ ఉప కులాల వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇవ్వడంతో మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బొల్లారం చంద్రమౌళి మాదిగ, జిల్లా కో కన్వీనర్ పసుల కమలాకర్, పసుల జీవన్, జంగాపల్లి రాజు, పసుల బేస్ కుమార్, గుండా థామస్, భిక్షపతి, కానాపురం లక్ష్మణ్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు, తుర్కపల్లె తదితర గ్రామాల్లో సుప్రీంకోర్టు తీర్పుపై ఎంఆర్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట సంబరాలు జరిపారు. రాష్ట్రంలో అమలు చేస్తామని పేర్కొన్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దుబ్బాక రాజు, నల్ల బాబు, సుంచు మల్లయ్య, బట్టు శ్రీకాంత్, శ్యాంసుందర్‌పాల్గొన్నారు.

రుద్రంగి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు చారిత్రక తీర్పు ఇచ్చిందని, తీర్పును స్వాగతిస్తున్నామని దయ్యాల నారాయణ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ సుదీర్ఘ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు.

సీఎం క్షమాపణ చెప్పాలి

చందుర్తి, ఆగస్టు 1: బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర అత్యున్నత చట్టసభలో హుందాగా వ్యవహరించాల్సిన సీఎం మహిళా ఎమ్మెల్యేలను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై సీఎం వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షురాలు చీటీ సంధ్యారాణి అన్నారు. కోనరావుపేట కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళల కోసం పోరాడుతున్న సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిని అవమానపరిచే విధంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చైతన్య దీక్షను విజయవంతం చేయాలి

చందుర్తి,ఆగస్టు 1:ఢిల్లీలో జరిగే సామాజిక చైతన్య దీక్షను విజయవంతం చేయాలని తెలంగాణ మాల మహా నాడు మండల అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మూడపల్లిలో చలో ఢిల్లీ కరపత్రాని గురువారం ఆవిష్కరించారు. 7,8,9 తేదీల్లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రొడ్డ రాంచంద్రం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటి కాలువలో పడిన గేదె

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 1: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనం, గిద్దె చెరువు వైపునకు వెళ్లే దారిలోని మురుగు నీటి కాల్వపై కప్పు ధ్వంసమవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గురువారం అటుగా వెళుతున్న పాడి గేదె అందులో పడిపోయి సుమారు 2 గంటల పాటు వేదనను అనుభవించింది. పోలీసులు స్థానికులతో కలిసి అతి కష్టం మీద పాడి గేదెను బయటకు తీశారు. పాడి గేదె తీవ్ర గాయాలకు గురైంది. గతంలో మురుగు నీటి కాల్వపైకప్పు ధ్వంసమై ప్రమాదకరంగా మారడంతో అధికారులు దానిపై కర్రలను అడ్డుగా ఉంచారు. ప్రమాదవశాత్తు పాడి గేదె పడిపోయింది. ఇప్పటికైనా ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

యువకుడి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 1: భూవివాదంలో రైతుపై దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలోని యువకుడు తేజావత్ రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలోని మాలోతు కిషన్‌తోపాటు అదే గ్రామానికి చెందిన బానోతు ప్రసాద్‌తో కలిసి గత నెల 24న వ్యవసాయ పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. పొలం గట్టు విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తేజావత్ రాజు కర్రతో కిషన్‌పై దాడికి దిగాడని వివరించారు. బాధితుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చందుర్తి ఆగస్టు 1: చందుర్తి మండల కేంద్రం శివారులో గురువారం రోడ్డు ప్రమాదంలో ఆశిరెడ్డిపల్లికి చెందిన తిరుపతి రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి.తిరుపతి రెడ్డి ద్విచక్ర వాహనంపై మర్రిగడ్డ నుంచి చందుర్తి వైపు వస్తున్నాడు. చందుర్తి శివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తిరుపతి రెడ్డికి గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఆసుపత్రికి తరలించారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి..

చందుర్తి ఆగస్టు 1:చందుర్తి మండలం మల్యాలలో వృద్ధురాలిపై కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చిర్రం మల్లవ్వ అనే వృద్ధురాలు ఇంటి ముందు ఉండగా కోతులు దాడి చేశాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

దుబాయ్‌లో వలస కార్మికుడి మృతి

వేములవాడ రూరల్, ఆగస్టు 1:ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన వలస కార్మికుడు దుబాయ్‌లో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. నూకలమర్రికి చెందిన పెండ్యాల చంద్రకాంత్(55) కొన్నేళ్లుగా ఉపాధి కోసం గల్ఫ్ వెళ్తున్నాడు. ఏడాది క్రితం వచ్చి దుబాయ్ వెళ్లాడు. కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య సమ స్యతో బాధ పడుతున్నాడు. దుబాయ్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

మాజీ మంత్రి సబిత వెన్నుపోటు నిజం కాదా?



మాట్లాడుతున్న కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ చక్రధర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 1:మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి వెన్నుపోటు నిజం కాదా? అని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ కనిమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశంలో జరిగిన చర్చలలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల్లో నిజాలు ఉన్నాయన్నారు. దీనిని పట్టుకొని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ధర్నాలు, నిరసనలకు పిలుపునివ్వడం శోచనీయమన్నారు. నాడు కేసీఆర్ కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా లేకుండా చేయడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొని అబాసు పాలయ్యారన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన సబితాఇంద్రారెడ్డి పార్టీకి వెన్ను పోటు పొడిచి మంత్రి పదవి కోసం బీఆర్ఎస్‌లోకి వెల్లడం నిజం కాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళలకు ఎన్నో అవమానాలు జరిగాయన్నారు. తెలంగాణలో మొదటిసారి అధికారంలోకి వచ్చాక మహిళలకు మంత్రి పదవులు ఇవ్వలేదన్నారు. డీకే అరుణను నీ సంగతి చూస్తామని కేసీఆర్ అడ్డగోలుగా మాట్లాడారని గుర్తు చేశారు. ఇదే అసెంబ్లీ సమావేశంలో కాంగ్రెస్‌లో ఉన్న సబితాఇంద్రారెడ్డిపై అడ్డగోలు మాటలు కేసీఆర్ మాట్లాడితే సబితాఇంద్రారెడ్డి తిట్టిన తిట్టుతిట్టకుండా తిట్టారని గుర్తుచేశారు. మాజీ గవర్నర్ తమిళసైని బీఆర్ఎస్ ప్రభుత్వం చాలా సార్లు అవమానించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనన చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎంపీ కవిత లిక్కర్ స్కాం చేయడం ఏంటని సోషల్ మీడియాలో తెలంగాణ మహిళలు ప్రశ్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు వైద్య శివప్రసాద్, వెల్ముల తిరుపతిరెడ్డి, చోటు పాల్గొన్నారు.

అక్కసు బయటపెట్టారు

అసెంబ్లీ సమావేశంలో అక్కా అని గౌరవంతో సంబోధిస్తే అవమానించారని నిందలేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అక్కసు బయటపెట్టారని గురువారం కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు అసెంబ్లీ సమావేశంలో డీకే అరుణను అవమానించినవారు మహిళలను అవమానించారంటూ ధర్నాలు నిరసనలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నిందలేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సభా మర్యాదలను పాటిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం సభను నడిపిస్తుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కావాలని సభలో రాద్దాంతాలు చేస్తున్నారని తెలిపారు. గతంలో సిరిసిల్లలో బతుకమ్మ చీరలు తయారు చేయకుండా సూరత్ నుంచి ఎందుకు తెప్పించారో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను తగలబెట్టడం సరికాదని పేర్కొన్నారు.

గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి



నివాళులర్పిస్తున్న వెన్నల గద్దర్



సభలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 1: ప్రజాయుద్ధ నౌక గద్దర్ ఒక వ్యక్తికాదు ఒక సంస్థ, ఒక శక్తి అని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ కూతురు వెన్నలగద్దర్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా వాసవి కల్యాణ మండపానికి చేరుకున్నారు. అనంతరం సిరిసిల్ల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల రాములు అధ్యక్షతన గద్దర్ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా గద్దర్, ప్రముఖ పత్రిక నిపుణుడు జహీరుద్దీన్ అలీ ఖాన్ ప్రథమ వర్ధంతి సందర్భంగా చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. గద్దర్ దళిత కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు చదివారని, బ్యాంక్ ఉద్యోగిగా పనిచేస్తున్న సమయంలో నాటి పరిస్థితులతో ప్రజా సేవకు అంకితం కావాలని నిర్ణయం తీసుకున్నారని అన్నారు. పాటల ద్వారా ప్రజల ఆవేదన, ఆకాంక్షలను వినిపించారన్నారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర కీలకమని, ధూంధాం కార్యక్రమాలతో ఊపిరి పోశారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గద్దర్ పేరుతో నంది అవార్డులను ఇస్తామని ప్రకటించడం హర్షనీయం అన్నారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటాలు చేసిన అమరవీరుల కోసం స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరనున్నట్లు చెప్పారు. అనంతరం గద్దర్ కూతురు వెన్నలగద్దర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగాన్ని రక్షించడమే గద్దర్ ఆశయమని, దాన్ని ముందుకు తీకెళ్లాలని అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం గద్దర్ జీవితాన్ని అంకితం చేశారన్నారు. కొందరు మహనీయులు చనిపోయిన వారి ఆశయం నెరవేరే వరకు మన మధ్యనే జీవిస్తారన్నారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వాంసాన్ని ఆపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ప్రొఫెసర్ కాసీం, ఓయూ జేఏసీ చైర్మన్ భాస్కర్, కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర కార్యదర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ గొట్టె రుక్మిణి, మాజీ కౌన్సిలర్ సిరిగిరి రమేష్, ప్రజా గాయకుడు దరువు ఎల్లన్న, నాయకులు సిరిగిరి కిషోర్, లక్ష్మణ్, కడారి రాములు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చట్టాన్ని అమలు చేయాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాసీం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కాసీం అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ కులంలో ఉన్న అసమానతలు తొలగిపోవాలని, ప్రతీ ఒక్కరికి రాజ్యాంగం కల్పించిన హక్కు రిజర్వేషన్లు అన్నారు. రిజర్వేషన్ల ఫలాలను ఏకులానికి ఎంత జనాభ ఉంటే ఆ జనాభా దామాష ప్రకారం వర్గీకరించాలని 30 ఏళ్ల క్రితం మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఉద్యమం మొదలైందన్నారు. ఆనాటి నుంచి ఈ నాటి వరకు ఉద్యమం ఉధృతంగా సాగుతోందన్నారు. 1999లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆర్డినెన్స్ ద్వారా ఎస్సీ వర్గీకరణ వేసి విద్యా, ఉద్యోగ రంగాల్లో మాదిగలు, ఉపకులాలకు ప్రయోజనం జరిగే విధంగా చేశారన్నారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చిన్నయ్య అనే వ్యక్తి సుప్రీం కోర్టులో చిన్న సాంకేతిక అంశాన్ని చూపించి వేసిన కేసుతో భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరించడానికి వీలులేదని తీర్పు నిచ్చిందన్నారు. కానీ నేడు సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం 341 ఆర్టికల్‌లో ఎక్కడ కూడా ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరించ కూడదని లేదని, సామాజిక న్యాయం అందించడానికి ప్రభుత్వాలు తప్పని సరిగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరించుకనే అవకాశం వెసులుబాటు ఉందని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ వ్యాఖ్యానించారని తెలిసిందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఈ తీర్పును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సమావేశంలో స్వాగతించారని, విద్యా, ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణలో ఏబీసీడీగా విభజించి రిజర్వేషన్లు కల్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారని అన్నారు. చట్టప్రకారం అమలు చేయాల్సిన అవరం ఉందని పాత ఎస్సీ వర్గీకరణలో కొంత సవరణ చేసి ఈ శాసన సభలోనే బిల్లు పెట్టి అమలు చేయాలని కోరారు. తారతమ్యాలను మరచి ఉద్యమంలో అమరులైన ఉద్యమకారులకు శ్రద్ధాంజలి ఘటించాలన్నారు. ఉద్యమానికి సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, కన్వీనర్ ఎనగందుల భిక్షపతి, నాయకులు పసుల కమలాకర్, గాలిపెల్లి శ్రీనివాస్, బొల్లారం చంద్రమౌళి, దాసరి కృష్ణంరాజు, కోట రవి, జంగంపల్లి రాజు, మిడిదొడ్డ అశోక్, గడ్డం ప్రవీణ్, కిరణ్, విజయ్ పాల్గొన్నారు.